# రండి, బాబూ... రండి

నత్తిబాబు, రాజబాబు ఈ చివరినుంచి ఆ చివరవరకూ ఆ రోడ్డుమీద నాలుగు సార్లు సర్వే చేశారు. అందులో రాసి ఉన్న, ఆ ఎ టు జెడ్ కాలేజి కనపడలేదు. అడ్రస్సుంది కానీ, అందులో రాసి ఉన్న వీధి అదే. మరి కాలేజీ ఏదీ?

"ఒరే! సత్తీ, అడ్రసు ఇంకోసారి చదువు..." అంటూ ఆగాడు రాజబాబు.

సత్తిబాబు కూడా ఆగి, చొక్కా ఎడమవైపు జేబులోంచి పర్సు తీసి, అందులో వున్న చాలా కార్డులు, కాగితం ముక్కల మధ్యనుంచి, ఓ పేపరు కటింగ్ తీసి రాజబాబుకిచ్చాడు.

"వెధవది, ఫోన్ నంబరియ్యలేదు..." అంటూ ఆ కటింగ్ సత్తిబాబుకి యిచ్చేశాడు.

"ఇదే వీధి అన్నాడు ఆ ట్రాఫిక్ పోలీసు. నమ్మకం కుదరక రెండు దుకాణాల్లో కూడా అడిగాం ఇదే అన్నారు. అంచేత ఆ కాలేజి ఈ వీధిలోనే ఎక్కడో ఉండి ఉంటుంది. ఈసారి వీధి గురించి కాకుండా కాలేజి గురించి అడుగుదాం. ఇప్పుడే టీ తాగాం కాబట్టి ఓ కిళ్ళీ వేసుకుని, అప్పుడు చూద్దాం... ఏమాంటావ్?" అంటూ ముందుకి నడిచాడు. రాజబాబు.

ఓ నాలుగు గజాలు నడిచాకా ఓ బేకరి వచ్చింది. దానికి అనుకునే ఓ పాన్ దుకాణం ఉంది. రెండు కట్టి ఇయ్యమన్నారు.

"ఇక్కడ ఏటు జెడ్ అని ఓ కాలేజి..."

పూర్తికాకుండానే అర్థం అయినట్టు తలూపాడు.

ఉత్సాహంగా "ఎక్కడుంది?" అని అడిగారు ఒక్కసారే.

కుడి చూపుడువేలుతో కుడివైపుగా చూపించాడు.

"ఆ మూసిన దుకాణాలున్నాయి. కదా, భవానీ వైన్స్... ముందు ఓ

స్కూటర్ ఉంది కదా, అక్కడే పైన" నిర్వికారంగా చెప్పి, పాన్ కట్టడంలో మునిగిపోయాడు.

రోడ్డు దాటి వెళ్ళి, భవానీ వైన్స్ దగ్గర ఆగి చూసారు. ఆ పక్కన సన్నటి మెట్లు కనపడింది.

"ఆశ్చర్యం! దీని ముందునుంచే రెండుసార్లు తిరిగాం. అయినా మనకి కనపళ్ళేదు" అంటూ ఆగాడు రాజబాబు, మెట్లముందు.

"ఎలా కనిపిస్తుంది? మనం కాలేజి అంటే, ఓ కాంపౌండ్, బిల్డింగ్, చెట్లు, గేటులాంటి దానికోసం చూస్తున్నాం... మన కళ్ళు పైకి వెళ్ళలేదు. అందుకే..." అంటూ ఓ అడుగు ముందుకేసి మెట్లు కేసి నడిచాడు.

ఒక్క మనిషి మాత్రమే ఎక్కగలిగే వెడల్పులో ఉన్న మెట్లు ఒకరి వెనకాల ఒకరు ఎక్కడం మొదలుపెట్టారు. పక్కనే గోడ మీద ఉన్న బాణాల్ని చూస్తూ, ఆ బాణాల సహాయంతో ఓ ఆఫీసు గదిలోకి వెళ్ళారు.

రెండు టేబుళ్ళు, రెండు బీరువాలు, ఓ నాలుగు తెల్ల ప్లాస్టిక్ కుర్చీలు ఓ నల్లగాజు పార్టిషన్ ఆఫీసు గదిని రెండుగా చేసింది.

ఓ టేబిల్ వెనకాల ఓ పంజాబి డ్రెస్ పిల్ల ఓ చేత్తో జుట్టుని పైకి తీసుకుంటూ ఫోన్లో మాట్లాడుతోంది. రిసెప్షనిస్ట్ అని అర్థం అయింది.

అలికిడికి తల ఎత్తి కూచోమన్నట్టు సైగ చేసింది.

రకరకాల ఫోటోలు, సర్టిఫికెట్లు, వివిధదేశాల యూనివర్సిటీల ఫోటోలు, అన్నీ చూస్తూ ఓ ఐదు నిమిషాలు గడిపారు యిద్దరు.

"ఏస్" అన్న ఆమెవైపు యిద్దరూ చూసారు.

"ఏం కావాలి?" యింగ్లీషులో అంది ఫోన్ పట్టుకునే.

"డిగ్రీలు" పూర్తి వాక్యం ఇంగ్లీషులో చెప్పలేక ఒక్క పదం వాడారు.

"లోపలికెళ్ళండి" అని మళ్ళీ ఫోన్లో మాటల్లో మునిగిపోయింది. లోపల విభూతి రేకలు దట్టంగా పెట్టిన ఓ తెల్లని వ్యక్తి ఆహ్వానించాడు.

"చెప్పండి..." చిరునవ్వుతో అడిగి కుర్చీలో వెనక్కి వాలాడు.

"ఇది 'ఎ టు జెడ్' కాలేజీ కదా!..."

"అవును సరిగ్గా అదే చోటికి వచ్చారు. నా పేరు వసిష్ఠమహర్షి.....

"నేను సదా మీ సేవలో. మీకు ఏం కావాలి?" ఇద్దరూ నమస్కారం చేశారు.

"మా జన్మ ధన్యం అయింది. మీ అంత గొప్ప గురువుగారి ఆధ్వర్యంలో మేము శుశ్రూష చేస్తూ పరీక్షలు రాయాలనుకోడం..."

"చాలా సంతోషం నా పేరులోని గొప్పతనం గుర్తించారు. తమ రాకకి కారణం?"

సిగ్గుపడ్డారు.

"మీకు తెలీనిదేముంది? మా లాంటివాళ్ళు ఎందుకొస్తుంటారో... మాకు అర్జంటుగా డిగ్రీలు కావాలి"

వశిష్ఠుల వారు నవ్వారు.

"అంతకంటేనా! మేం ఉన్నదే అందుకు. ఏం చేస్తూంటారు?"

"సేల్స్ సైడున్నాం..."

"ప్చ్! దానికి డిగ్రీలెందుకు? మాట్లాడం వస్తే చాలు కదా"

"కానీ, పెళ్ళికి డిగ్రీ ఉండాలని ఈమధ్యే అర్థం అయింది."

పకపకా నవ్వాడు.

"సరే... పాయింటుకొద్దాం. ఏ డిగ్రీ కావాలి? ఏ యూనివర్సిటీది కావాలి? దేశందా విదేశందా! విదేశం అంటే ఎక్కువ యూరోపియన్ యూనివర్సిటీలవి..."

మళ్ళా సిగ్గుపడుతూ తలొంచుకుని వేళ్ళు నలుపుకున్నారు.

"మాకు దాని గురించిన జ్ఞానం లేదు. ఏదైనా ఫర్వాలేదు. విదేశీ డిగ్రీ అయితే మంచిదని మా కనిపిస్తోంది..."

"ఓ.కే... మీరు కోరుకున్నట్లుగా ఫారిన్ డిగ్రీ యివ్వడానికి మాకేం అభ్యంతరం లేదు. ఓ పుస్తకం యిస్తాను. ఏ యూనివర్సిటీ డిగ్రీ కావాలో

ఆలోచించుకుని చెప్పండి" అంటూ, ఎడంవైపు ఒంగి, ఎడం చేత్తో టేబుల్ అర లాగి, ఓ పుస్తకం తీసి టేబుల్ మీద పడేస్తే, అది సర్రున వాళ్ళవైపుగా జారింది.

వెంటనే ఓ పుస్తకం తీసాడు.

"ముందు రిజిస్ట్రేషన్ చేయండి..." అంటూ కార్బన్ పేపరు సరిచేసి పెన్ను తీశాడు.

"పేర్లు చెప్పండి..."

ఉత్సాహంగా పేర్లు చెప్పారు.

"నాలుగొందలివ్వండి..." అంటూ సర్రున రసీదులు చింపి ముందుంచాడు.

"ఈ కాయితముక్కకి నాలుగొందలా!" కొంచెం కోపంగా అన్నాడు రాజబాబు.

అలవాటుపడ్డ మాటలేమో, వశిష్ఠులవారికి కోపం రాలేదు.

"అదే మీకు మాకు ఉన్న తేడా! మీ దృష్టిలో అది కాయితముక్క కానీ, మాకు అది సరస్వతిదేవి ఆరాధనకి, ఉపాసనకి ఓ సాధన..."

అయినా ఇద్దరూ జేబులో చేతులు పెట్టలేదు.

"డిగ్రీలు కావాలనుకున్నప్పుడు మేం అడగడం, మీరివ్వడం, చాలా సహజంగా జరిగిపోవాలి. మీరు వాదిస్తే... సరస్వతీ దేవిని అవమానించినట్లే..."

సెంటిమెంటు దెబ్బ... నోరుమూసుకుని డబ్బిచ్చుకున్నారు.

డబ్బుని సొరుగులో పడేసి లేచాడు. 'రండి' అంటూ కుర్చీ వెనక్కి తోశాడు. ఎక్కడికో తెలీకపోయినా యిద్దరూ లేచారు.

సన్నటి మెట్లు కాబట్టి ముందు వశిష్ఠులుగారు, రాజబాబు ఆ వెనక్కాల సత్తిబాబు, రామాయణ కాలంనాటి సీనులాగా దిగి రోడ్డుమీదకి వచ్చారు.

రోడ్డు క్రాస్ చేసి, ఎదురుగా ఉన్న బేకరిలో కూచుని టీ ఆర్డరిచ్చారు. కుర్చీలో కూచున్నారు.

"ఇక్కడికెందుకు?" అయోమయం.

"అక్కడ మాట్లాడుకోవడంలో రిస్క్ ఉంటుంది..." అంటూ కుర్చీని అటూ ఇటూ జరిపి, ఆఫీసు కనపడే విధంగా కూచుని వాళ్ళవైపు చూసాడు.

"మంచివాళ్ళకే శత్రువులెక్కువంటారు. అది మా విషయంలో పచ్చి నిజం. మేం చేస్తున్నది ప్రజాసేవ. మేం ఉన్నది అందుకే. మా మూలంగా కొంతమంది జీవితాలు బాగుపడ్తాయంటే, కొంతమందికి నచ్చడం లేదు. అందుకని మా జాగ్రత్తలో మేం ఉంటా..."

"అంటే డిగ్రీలు..." గబుక్కున అడిగారు.

"మీకిస్తాం దాని గురించి మీకేం బెంగక్కర్లేదు.

కట్టండి" అంటూ అరఠావు సైజులో ఉన్న రెండు కాయితాలు తీసాడు. తన బ్యాగులోంచి.

"ఎంత?"

"ఆరువేలు".

"డబ్బు కట్టాకా... డిగ్రీలిస్తారా!..." ఆశగా చూసారు.

"అప్పుడేనా! పరీక్షలయ్యాక యిస్తాము..." చెరగని చిరునవ్వు.

"కుదర్దు... మేం పరీక్షలు రాయిలేకనే కదా, ఈ షార్ట్‌కట్... మాకు పరీక్షలకి ఆమడదూరం మరి..."

నవ్వాడు మళ్ళా టీ తాగడం మొదలెట్టాడు.

"పరీక్షలని అన్నాను కానీ, మీరు రాయాలని అనలేదుకదా! దానికి మీరు చదివి ప్రిపేర్ అవాలని అనలేదు కదా! అవునా కాదా!" తల నిలువుగా ఊపుతూ అన్నాడు.

తల ఊపారు అవునన్నట్లుగా

"పరీక్షలవుతాయి, ప్రశ్నపత్రాలిస్తాం, జవాబులు కూడా మేమే యిస్తాం. అయితే మీ చేతిరాతతో దాన్ని ఆన్సర్ షీట్లలో రాయాలి... ఓ.కే..."

"మాకు... ఓ.కే... పద్ధతి నచ్చింది" అంటూ డబ్బిచ్చి, ఫారాలు తీసుకున్నారు.

డబ్బుని బ్యాగ్‌లో పెట్టుకున్నాకా, యింకోసారి టీకి ఆర్డర్ యిచ్చాడు.

"ఇప్పుడే రిస్కులుంటాయి. ఎప్పుడు ఏ చెకింగ్ ఆఫీసర్ వస్తాడో, ఏ పేపరు వాళ్ళు వస్తారో తెలీదు. ఏ టీవీ ఛానెల్ వాడు మైక్రో కెమెరాతో వస్తాడో తెలీదు. పరీక్ష ఎక్కడో ఓ చోట... చాలా పకడ్బందీగా పెడ్తాం..."

బెంగపడ్డారు.

"మా డిగ్రీలు పనికిరావని, అసలైనవి కావని అంటారు. కొన్ని ఆఫీసులు మా డిగ్రీలని గుర్తించడం లేదు... కిట్టనివాళ్ళు అనేకం అంటారు."

"అయ్యా! మా ఉద్యోగం మాకుంది కావల్సింది.

డిగ్రి అంతేకానీ, మాకు ఈ డిగ్రి అసలుదో, నకలుదో మాకక్కర్లేదు..."

"సరే అయితే, వ్యవహారం త్వరగానే తేలిపోయింది. నేను చెప్పినవన్నీ గుర్తుపెట్టుకోండి. 'అయ్యో మళ్ళా ఆయన చెప్పలేదే' అని మీరు నన్ను అపనిందలపాలు చెయ్యక్కర్లేదు. నలభై యాభై వేల రూపాయలకి వచ్చే డిగ్రీని పదివేలకే యిస్తాం. మిగిలిన నాలుగువేలు పరీక్ష రాయడానికొచ్చినప్పుడిచ్చి, మీ డిగ్రీ మీరు తీసుకెళ్ళండి."

ముగ్ధులయ్యారు ఆయన మాటలకి "ఎప్పుడు రమ్మంటారు?"

"ఈ నెలాఖరుకి పరీక్షలున్నాయి. మీరు ఓ ఐదు రోజులుండాల్సి వస్తుంది. ఎక్కడ ఉంటారో అది మీ యిష్టం... అప్పుడే రాతలు, యిచ్చి పుచ్చుకోడాలు జరుగుతాయి. ఓ.కేనా..." అంటూ లేచాడు.

"ఓ.కే..." అంటూ లేచారు.

మళ్ళీ నెలాఖరున –

మిగిలిన డబ్బు తీసుకుని, సత్తిబాబు, రాజబాబు, ఆ సన్నటి మెట్లు ఎక్కి 'ఏ టు జెడ్' ఆఫీసుకెళ్ళారు.

తాళాలువేసి ఉన్నాయి. గుండె గుభేలుమంది.

"యిదేవిటీ! తలుపు మూసి ఉంది. కొంపతీసి, మనకి టోపి పెట్టేయలేదు కదా!"

"మనిషి చూస్తే వీబూతిరేకలు ఎర్రబొట్టుతో ఉన్నాడే, టోపి పెట్టేవాడిలా కనబడలేదే..." అటూ ఇటూ తిరిగి కిందకొచ్చారు.

"ఆరువేలు, నాలుగు వందలూ పోయినట్లేనా! గోవిందా, గోహోవిందా!"

"ఉండు వీణ్ణి అడుగుదాం..." అంటూ వైన్ షాపులోకి దూరాడు రాజబాబు. వెనకాలే వెళ్ళాడు సత్తిబాబు.

ఏం కావాలన్నట్లు చూసాడు. కౌంటర్ వెనక్కాల కూచున్న మనిషి.

"పైన ఓ కాలేజి ఉండాలి. అది..." అంటూ నసిగాడు రాజబాబు,

"ఉంది కానీ, ఇప్పుడు తాళం వేసి ఉంది కదా! తెరుస్తారు. ఓ వారం రోజులయ్యాకా తెరుస్తారు." అందులో పనిచేసేవాడిలాగే మాట్లాడాడు.

"మీకెలా తెలుసు?" పాయింటు లాగినట్లుగా అడిగాడు, రాజబాబు.

"మేం ఇక్కడే పదేళ్ళనుంచి ఉంటున్నాం. పైగా ఇది ఎప్పుడూ జరిగేదే. ఏమీ కొత్తగాదు ఎవరో ఫోన్ చేస్తారు. పోలీసువాళ్ళొస్తారు. అన్ని తీసుకెళ్తారు. మళ్ళా ఓ వారం అయ్యాకా వీలయితే అక్కడే ఉంటారు. లేకపోతే ఆఫీసు మారుస్తారు. ఆఫీసు మారిస్తే మాకు చెప్తారు. ఈ కాలేజి ఇంతకు ముందు, మా షాపు పక్కనే ఉండేది. ఈ ఏడాదే పైకి వెళ్ళింది..."

"ఆరెరే! ఎలా ఇప్పుడు?"

"ఇప్పుడు ఏం కాదు... ఆయన యిక్కడే ఎక్కడో ఉండి ఉంటాడు. పోలీసులు కాయితాలు, ఫైళ్ళు తీసుకెళ్ళారు. అప్పుడు ఆ సారు లేడు."

"మరి ఆ సారుని తీసుకెళ్ళలేదా! పోలీసులొచ్చినప్పుడు ఆయన లేరా!"

"ఆసారుకి ముందే తెలుస్తుంది. ఆయన మనుషులు సెల్‌ఫోన్లు పెట్టుకుని ఇక్కడిక్కడే తిరుగుతూంటారు. వాళ్ళే సిగ్నల్స్ యిస్తారు. ఆయన వెళ్ళిపోతాడు... ఆ పోలీసులొచ్చేటప్పటికి, ఆఫీసు బాయ్ ఉంటాడు. పోలీసులు అడిగే ప్రశ్నలకి సమాధానం వాడికి తెలీదు.

విసుగొచ్చి, బీరువాల్లోని కాయితాలు, ఫైళ్ళు తీసి, చిందర వందర చేస్తారు. ఏవో కొన్ని పట్టుకెళ్ళారు. అదంతా చెత్త, అక్కర్లేని కాయితాలు అని ఆ

వశిష్టసారుకి తెలుసు. మళ్ళా ఓ వారం అయ్యాకా అంతా మామూలే. మీరు ఓ వారం తర్వాత రండి..."

ఉస్సూరుమన్నారిద్దరూ.

"యిదీ... కారణం... యిందుకే ముందు జాగ్రత్తగా ఫోన్ నంబరు నంబరు ఇయ్యలేదు. పోనీ ఓ పని చేస్తే... పోలీసు రిపోర్టిస్తే..."

"సదేలే... అదేదో సామెత చెప్పినట్లుంది. పోలీసులే తాళం వేసి వెళ్తే దాని మీద నువ్వేం రిపోర్టు యిస్తావ్? ఏవనిస్తావ్? రిపోర్టిచ్చామే అనుక్కో... యింక హైద్రాబాదులోనే మకాం పెట్టాల్సి వస్తుంది. ఇప్పటికే మూడుసార్లు, రానూ పోనూ కలిపి పన్నెండొందలు ఆర్టీసీ వాళ్ళకి ధారపోసాం. అసలు మన రోజు బాగాలేకపోతే, ఎవర్నని ఏం లాభం? ఏం ప్రయోజనం? నీకు గుర్తుందా, మనం బయల్దేరిన రోజు ద్వాదశి, ద్వాదశి దగ్ధం, మంచిదికాదు, యివాళొద్దు అని నేనంటే నువ్వే అన్నావ్? అంతా ఛాదస్తం. ద్వాదశి లేదు, ఏకాదశీ లేదు అని అన్లేదూ... చూశావా! ఇప్పుడేమయిందో...కొన్ని తిథులు చాలా పవర్‌ఫుల్."

"ఇంక వదిలెయ్యి... అయిపోయిన దాని గురించి విశ్లేషణ చెయ్యడం ఎందుకు? డబ్బుకి అన్ని దొరుకుతాయంటారు... కానీ మన దృరదృష్టం అన్ని సార్లూ అన్నీ దొరకదు... సరే, మళ్ళా వద్దాం."

పది రోజులు పోయాక, సత్తిబాబు, రాజబాబు భవానీ వైన్స్ ముందున్నారు.

"రండి... ఆ వసిష్ఠగారు కాలేజి మార్చారు. ఆ ఎదురుగా ఉన్న మేడమీద పెంట్ హౌస్... అక్కడికే వెళ్ళండి..."

మరో ఐదు నిమిషాలకి పెంట్ హౌస్‌లో ఉన్నారు.

"రండి... బాబు... రండి... డబ్బిల్లా ఇవ్వండి. ఆ వెనక గదిలో పేపర్లుంటాయి. పరీక్ష చూసి రాయండి. ఆ తర్వాత సర్టిఫికెట్లు తీసుకెళ్ళండి.

ఇద్దరూ పక్కగదిలో కూచున్నారు. ప్రశ్నపత్రాలు, రెడీగా ఉన్న జవాబులు చూసుకుంటు... అప్పటికే ఓ ఇద్దరు ఖుద్దిగా కూచుని రాస్తున్నారు.

"రండి... రండి... మేం ఉన్నది అందుకే కదండి. మీ సేవలే ముఖ్యం..." ఎవరితోనో వశిష్ఠులవారు మాట్లాడుతున్నారు.

(ఆంధ్రభూమి దిన పత్రిక, 25 మార్చి 2006)